# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 21 ఫిబ్రవరి : 2019 విడుదల : 6

**యథార్థవంతులు మేలైన దానిని**

**స్వతంత్రించుకొందురు**

**యథార్థవంతుల యథార్థత**

**వారికి త్రోవ చూపించును.**

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

ఫిబ్రవరి - 2019

**సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.100/-**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-7 |
| 2. | ఆశానిగ్రహము | 8-13 |
| 3. | నిరీక్షించుట | 15 |
| 4. | మెలితే ద్వీపము | 16-18 |
| 5. | సువార్త కూటములు | 19 |


## సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥9.00 ల నుండి ఉ॥5.00 గం॥ల వరకు

# ఎడిటర్ అర్పణ

**మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా వందనములు.**

**“నీ దాసులమైన మేమును మా పూర్వికులును గొఱ్ఱెల కాపురులమని ఫరోతో చెప్పిరి... నీ దాసులు నివసింప సెలవిమ్మని ఫరోతో అనగా”** ఆది. 47:3,4.

యాకోబు యొక్క 12 మంది కుమారులలో పదకొండవవాడైన యోసేపును తన అన్నలు అసూయతో ఒక గుంటలో పడద్రోసి ఇష్మాయేలీయులకు అమ్మివేయగా వారు పోతీఫరను ఒక ఐగుప్తు సేనాధిపతికి అమ్మివేసిరి. యెహోవా యోసేపునకు తోడైయుండుట యజమానుడు చూచినప్పుడు అతడు తన యింటిమీద విచారణకర్తగా నియమించి తనకు కలిగినదంతయు అతనిచేతికి అప్పగించెను. అటుతరువాత యజమానుని భార్య యోసేపుమీద నేరము మోపగా అతడు కోపముతో మండిపడి యోసేపును చెరసాలలో వేయించెను. అయితే యెహోవా యోసేపునకు తోడైయుండి, అతనిమీద చెరసాల అధిపతికి కటాక్షము కలుగునట్లు చేసెను. చెరసాల అధిపతి ఖైదీలనందరిని యోసేపు చేతికి అప్పగించెను. యోసేపు చేయునది యావత్తు యెహోవా సఫలము చేసెను.

అటుపిమ్మట ఐగుప్తు రాజు యొక్క పానదాయకుడును భక్ష్యకారుడును చెరసాలలో వేయబడిరి. యోసేపు వారికి ఉపచారము చేసెను. కొన్నిదినములైన తరువాత వారిద్దరు ఒక్కటే రాత్రియందు కలలు కని చింతాక్రాంతులై ముఖములు చిన్నబోగా, యోసేపు వారిని గుర్తించి దేవుని కృపతో కలల భావమును తెలియజేయగా యోసేపు చెప్పినరీతిగా పానదాయకుల అధిపతికి తిరిగి తన ఉద్యోగము మరల ఇచ్చెను. భక్ష్యకారుడు మ్రానుమీద వ్రేలాడదీయబడెను.

యోసేపు ఇంకను చెరసాలలో ఉంచబడెను. రెండేండ్లు గడిచిన తరువాత ఫరో ఒక కల కనెను. అతడు కలవరపడి ఐగుప్తు శకునగాండ్రను విద్వాంసులనందరిని పిలిపించి కలను వివరించెను గాని వాటి భావమును తెలుపగలవాడెవడును ఫరో రాజ్యములో లేకపోయెను. పానదాయకుల అధిపతి యోసేపును జ్ఞాపకము చేసికొని చెరసాలలో తనకు జరిగిన దానిని ఫరోతో చెప్పగా ఫరో యోసేపును చెరసాల నుండి పిలిపించెను. యోసేపు ఫరోతో ఐగుప్తుదేశమంతటా రాబోవు కరువును గూర్చి దేవుడు తమరికి ముందుగా తెలియజేసెనని కలనుగూర్చిన భావమును వివరించెను. యోసేపు చెప్పిన కలభావమును బట్టి ఇతడు దేవుని ఆత్మ గల మనుష్యుడని ఫరో గ్రహించి ఐగుప్తుదేశమంతటిమీద అధికారిగా నియమించెను.

యోసేపు చెప్పిన ప్రకారము ఏడు కరవు సంవత్సరములు ఆరంభమాయెను గాని ఐగుప్తుదేశమందంతటను ఆహారముండెను గనుక యోసేపు కొట్లన్ని విప్పించి ఐగుప్తీయులకు ధాన్యమమ్మకము చేసెను. మరియు ఆ కరవు ప్రతి దేశమందు భారమైనందున సమస్త దేశస్థులు యోసేపునొద్ద ధాన్యము కొనుటకు ఐగుప్తునకు వచ్చిరి. కరువు కనాను దేశములో కూడ ఉండెను గనుక ధాన్యము ఐగుప్తులో ఉన్నదని యాకోబు తెలిసికొని ఆహారము కొనుటకు అతని కుమారులను ఐగుప్తునకు పంపెను. యోసేపు తన సహోదరులను చూచి వారిని గుర్తుపట్టి ఐగుప్తునకు వెళ్లునట్లు మీరు అమ్మివేసిన సహోదరుడను నేనే. మీరు నన్ను అమ్మివేసినందుకు దు:ఖపడకుడి ప్రాణరక్షణ కొరకు దేవుడు మీకు ముందుగా నన్ను పంపించెనని చెప్పి తనను తాను కనుపరచుకొనెను. యోసేపు సహోదరులు ఐగుప్తునకు వచ్చిన వర్తమానము రాజైన ఫరోకు తెలియవచ్చినప్పుడు యోసేపు తండ్రి పరివారమంతటిని కనాను దేశములో నుండి ఐగుప్తులో నివసించుటకు తీసికొని రమ్మని యోసేపునకు ఆజ్ఞ యిచ్చెను. యోసేపు యింటివారందరు ఐగుప్తునకు రాగా వారిని అతడు ఫరో ఎదుట నిలువబెట్టెను.

**"గొఱ్ఱెల కాపరియైన ప్రతివాడు ఐగుప్తీయులకు హేయుడు" ఆది.46:33,34.**

అప్పటివరకు తన కుటుంబ వృత్తాంతం ఫరోతో చెప్పే అవసరం యోసేపునకు రాలేదు. యోసేపును ఐగుప్తు అధికారిగా నియమించేటప్పుడు కూడ అతని కుటుంబ వివరాలు ఫరో అడుగలేదు యోసేపు కూడా చెప్పలేదు. యోసేపు తన కుటుంబికులతో గొఱ్ఱెలకాపరియైన ప్రతివాడు ఐగుప్తీయులకు హేయుడు గనుక ఫరో మిమ్మును పిలిపించి మీ వృత్తి యేమిటని అడిగినయెడల మీ దాసులమైన మేము మా చిన్నతనము నుండి పశువులుగలవారమై యున్నామని ఉత్తరమియ్యుడని చెప్పెను. వారు ఫరో సముఖమందు నిలిచినప్పుడు ఫరో వారి కుటుంబ వివరములను వృత్తిని అడుగగా వారు మేము గొఱ్ఱెల కాపరులము అని చెప్పిరి. యోసేపు తన కుటుంబ పరిస్థితి చెప్పితే ఫరో ఏవిధముగా ప్రతిస్పందించునో, తన కుటుంబికులు ఐగుప్తీయులకే హేయులు గనుక తన పదవి ఏమౌతుందోనని ఆలోచించక సత్యము చెప్పెను. యోసేపు సత్యము చెప్పిన తరువాత ఇంకా 73 సం॥లు ఐగుప్తును పరిపాలించాడు. మనము హృదయమంతటితో యథార్థతను ప్రేమించి సత్యాన్ని జరిగిస్తే మన స్థితి గతులు ఏవిధముగా ఉన్నను ప్రభువు మనకు సహాయం చేసి క్షేమకరమైన మార్గములలో స్థిరపరుస్తారు. నీవు యథార్థతను, వాస్తవికతను, సత్యాన్ని ఎంతగా ప్రేమిస్తావో అంత ఆశీర్వాదం ప్రభువు నీ జీవితంలో కుమ్మరిస్తారు.

యోసేపు ఏడు సం॥లు ఐగుప్తును పరిపాలించిన తరువాత తనలో యథార్థత కొరకైన నాణ్యత, సత్యం కొరకైన ఆకాంక్ష శాతం తగ్గిపోలేదు. అది అతనిలో చాలా స్థిరముగా ఉన్నది. రోజులు గడిచే కొలది భక్తి జీవితములో నాణ్యత తగ్గిపోయేవారిగా మనం ఉండకూడదు. మేము గొఱ్ఱెల కాపరులము అని చెప్పిన ఆ ఒక్క మాటే యోసేపును ఇంకా ఉన్నతమైన స్థానంలోనికి తీసికొని వెళ్లింది. "ఫరో యోసేపును చూచి – నీ తండ్రియు నీ సహోదరులును నీ యొద్దకు వచ్చియున్నారు. ఐగుప్తు దేశము నీ యెదుట ఉన్నది, ఈ దేశములోని మంచి ప్రదేశమందు నీ తండ్రిని నీ సహోదరులను నివసింప చేయుము, గోషెను దేశములో వారు నివసింపవచ్చును, వారిలో ఎవరైన ప్రజ్ఞగలవారని నీకు తోచినయెడల నామందలమీద వారిని అధిపతులుగా నియమించుమని చెప్పెను" ఆది. 47:5,6. యోసేపు తన సహోదరులను ఐగుప్తులో మంచి ప్రదేశమందు ఉంచెను. తాము గొఱ్ఱెల కాపరులమని వాస్తవము చెప్పుటవలన వారు ఐగుప్తీయులకు హేయులు గనుక ఇబ్బందిని ఎదుర్కొనవలసినది కాని వారికి గొప్ప మేలు జరిగినది. నీవు హృదయమంతటితో సత్యం చెప్పినప్పుడు నీకు ఏ సమస్య ఉండదు.

**"నీ సెలవు లేక ఐగుప్తు దేశమందంతటను ఏ మనుష్యుడును తన చేతినైనను కాలినైనను ఎత్తకూడదని చెప్పెను"** ఆది 41:44. యోసేపు ఒక ఉన్నతమైన స్థానములో ఉన్నాడు గనుక తన కుటుంబాన్ని ఫరోకు పరిచయం చేయకుండ పోషించగలడు. ఫరో తనకు పరిపూర్ణమైన స్వేచ్ఛను ఇచ్చినను తాను ఏమి చేసినను ఫరో సెలవుతోనే చేశాడు. యోసేపు యొక్క ఆశీర్వాదమునకు కారణం "చెప్పి చేసే మనస్సు" కాని చేసిన తరువాత చెప్పే మనస్సు కాదు. అందుకే యోసేపుకు తన కుటుంబముతోగాని ఫరోతో గాని ఐగుప్తీయులతో గాని 80 ఏండ్లు ఏ ఇబ్బంది కలుగలేదు. ఇది మన భక్తి జీవితమునకు ఎంతో అవసరం.

**"అతనిగూర్చిన అంగలార్పు దినములు గడచిన తరువాత యోసేపు ఫరో యింటివారితో మాటలాడి – మీ కటాక్షము నా మీద నున్న యెడల మీరు అనుగ్రహించి నా మనవి ఫరో చెవిని వేసి – నా తండ్రి నాచేత ప్రమాణము చేయించి – ఇదిగో నేను చనిపోవుచున్నాను, కనానులో నా నిమిత్తము సమాధి త్రవ్వించితిని గదా, అందులోనే నన్ను పాతిపెట్టవలెనని చెప్పెను. కాబట్టి సెలవైతే నేనక్కడికి వెళ్లి నా తండ్రిని పాతిపెట్టి మరల వచ్చెదనని చెప్పుడనెను"** ఆది. 50:4,5. యోసేపు తండ్రి సమాధి కార్యక్రమమునకు వెళ్ళడానికి ఫరో ఇంటివారిని సెలవు అడుగుచున్నాడు. యోసేపు ఐగుప్తు రాజ్యమంతటిలో చాలా ప్రాముఖ్యమైన

వ్యక్తి. ఫరోను ప్రత్యక్షంగా కలవవచ్చు కాని ఫరో ఇంటివారితో తన తండ్రి సమాచారమును తెలియపరచెను. ఒక ఉన్నతమైన పదవిలో దేవుడు యోసేపును ఉంచాడు. అప్పటికే చాలా కాలం యోసేపు ఐగుప్తును పరిపాలించాడు. దేశములో పంట ఎక్కడ సమృద్ధిగా పండుతుందో, పండిన దానిని ఎక్కడ పెట్టాలో, పెట్టిన దానిని ఎలా అమ్మాలో కూడ యోసేపుకు తెలుసు. అయితే ఒక సమయము వచ్చినప్పుడు ఫరో ఇంటివారి యొద్ద చేతులు కట్టుకొని తన తండ్రిని కనానులో పాతిపెట్టుకు సెలవు కావలెనని ఫరోకు కబురు పంపెను. **“ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై నామాట విని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను” యెషయా 66:2** లో ప్రభువు చెప్పారు. యోసేపు ఐగుప్తు అధికారి అయినను రాజైన ఫరో ఎదుట దీనుడై వణకుచుండెను. మన జీవిములో దీవెన చూడలేకపోవుటకు, సమస్యలు జటిలమగుటకు మరియు వ్యాధులు స్వస్థపరచబడకపోవుటకు కారణం దీనత్వం లేకపోవుటయే. యోసేపు గొప్ప స్థానములో ఉన్నను ఎక్కడ తన నోటనుండి ఒక్క కఠినమైన మాట కూడ రాలేదు. దినములు గడిచే కొలది మన మాటలలో దీనత్వము కనబడాలి, దాసులమైపోవాలి.

యోసేపు 80 సం॥లు ఐగుప్తు గవర్నర్‌గా పనిచేశాడు కాని ఎన్నడు సెలవు తీసుకోలేదు తన తండ్రిసమాధి కార్యక్రమమునకు మాత్రమే సెలవు తీసుకున్నాడు. దేవుడు తనకు అప్పగించిన పని నుండి యోసేపు ఒక్కరోజు కూడ ప్రక్కకు వెళ్లలేదు. అందుకే దీర్ఘకాలం యోసేపు ఐగుప్తును పరిపాలించాడు. నీ చేతిలో ఉన్న పని నీకు దేవుడు ఇచ్చినది కాని మనుష్యులు ఇచ్చినది కాదు. ఒక పనిని ప్రభువు నీకు అప్పగించాడు అనే గ్రహింపు ఉంటే నీవు దానిని వదిలిపెట్టవు. అప్పుడు నీకు ఏ వ్యతిరేకత ఉండదు. దేవుని ఆత్మ మెట్టలను, పల్లములను సరిచేసుకొంటూ వెళ్లిపోతుంది. యోసేపు నేను గొఱ్ఱెలను మందలను సహోదరుల క్షేమాన్ని తెలుసుకోవడానికి పంపబడిన పని నుండి ఐగుప్తు గవర్నర్‌గా ఇప్పుడున్న ఈ పనిని దేవుని చేత పొందితినని ఎంచి ఎన్నడు దాని నుండి ప్రక్కకు వెళ్ళడానికి ఇష్టపడలేదు. యోసేపు దేవుడు తనకు అప్పగించిన పనిని భయముతో, భక్తితో, విధేయతతో, దీనత్వముతో, ఆశతో చేశాడు. దేవుడు నీకు అప్పగించిన పనిని నీవు ఘనంగా చూచినట్లయితే ఇంకా గొప్పవాటిని ప్రభువు నీకు అప్పగిస్తారు. దేవుడు నీ చేతిలో ఉంచిన పనిని తక్కువగా చూచినట్లయితే ఉన్న పనిని కూడ ప్రభువు నీ యొద్దనుండి తీసివేస్తారు. **“కలిగినవానికే యియ్యబడును, వానికి సమృద్ధి కలుగును, లేనివానికి కలిగినదియు వానియొద్దనుండి తీసివేయబడును” మత్తయి 13:12.**

యోసేపుకు వచ్చిన మొదటి ఉద్యోగం గవర్నర్ పని కాదు కలకు అర్థం చెప్పడం. దేవుడు నీకు అప్పగించిన పని చిన్నదే అయినా దానిలో నమ్మకముగా ఉన్నప్పుడు గొప్పవాటిని ప్రభువు నీ చేతిలో పెడతాడు. యోసేపు తండ్రి యింటిలోను, పోతీఫరు యింటిలోను, చెరసాలలోను సింహాసనం ఎక్కినప్పుడును దేవుడు తనను ఎక్కడ ఉంచినను బాధ్యతగా ఉన్నాడు. తనకు ఇచ్చిన పనిని ఘనంగా ఎంచాడు. అది ప్రభువు ఇచ్చినది అనే గ్రహింపు ఉంది గనుకనే ఒక్క చేతితో ఐగుప్తును పోషించాడు. ప్రభువు నీ చేతికి అప్పగించిన పనిని హృదయమంతటితో, నమ్మకంగా భయంతో, నాణ్యతతో చేయాలనే మనస్సు నీకుందా? నీకు ఆ గ్రహింపు ఉంటే దేవుని ఆత్మ నిన్ను నడిపిస్తుంది నీవు పరిచర్య చేసే విధానము వ్యత్యాసముగా ఉంటుంది. నీ ఆశను బట్టి, అపేక్షను బట్టి దేవుడు నీకు ఆరోగ్యం ఇస్తారు. యేసయ్య గాయములు మనకు స్వస్థతను ఇస్తాయి. నీకు ఆశ ఉంటే దానికి తగిన ఆరోగ్యము కూడ ప్రభువు ఇచ్చి నిన్ను నడిపించగలడు. యోసేపు 110 సం॥లు జీవించాడు. అతని జీవితములో ఎన్నడు అనారోగ్యం లేదు.

**"శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మును చూచుచున్నాడు తండ్రి శిక్షింపని కుమారుడెవడు? కుమాళ్లయినవారందరు శిక్షలో పాలుపొందుచున్నారు, మీరు పొందనియెడల దుర్బీజులేగాని కుమారులు కారు" హెబ్రీ. 12 :7,8.** తండ్రి మనలను శిక్షిస్తే మనం కుమారులము. యోసేపు 13 ఏండ్లు కఠినంగా శిక్షించబడ్డాడు. అందుకే కుమారుడయ్యాడు, వారసుడైనాడు. నీవు శిక్షను కోరుకుంటున్నావా లేక సున్నితంగా వ్యవహరించబడుటనే కోరుకుంటున్నావా? ఈ దినములలో మనము శిక్షను తర్ఫీదును కఠినంగా ఉండుటను ప్రేమించలేకపోవుచున్నాము కాని ఏది సులభంగా ఉంటుందో దానిని కోరుకొని నష్టపోవుచున్నాము. దేవుడు నీకు ఏదైన శిక్షను ఇస్తే దానిలో నమ్మకంగా ఉండుము. అది నీకు ప్రయోజనకరమే అవుతుంది.

ప్రియులారా! మనము భక్తిజీవితములో యథార్థం చెప్పుచున్నామా లేక ద్వంద్వ మనస్సుతో, వేషధారణతో కొనసాగుచున్నామా? ఎంత లోతైన సత్యముతో మన కుటుంబాలను, సంఘాలను కట్టుకొంటున్నాము? మన ఆత్మీయ జీవితములో యోసేపువలె యథార్థతలో లోతుగా స్థిరపరచబడి దీనత్వము గలిగి మనకు అప్పగించబడిన పరిచర్య దేవుడు అనుగ్రహించాడనే గ్రహింపుతో మనము అది కఠినమైనదైనను శిక్షను ప్రేమించేవారముగా నుండి ఘనముగాను నమ్మకముగాను బాధ్యతతోను చేసినట్లయితే యోసేపువలె ప్రభువు మనలనుకూడ ఫలించెడి కొమ్మగా చేయును గాక!

*– ఎడిటర్*

# ఆశానిగ్రహము

**"అయితే ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము" గలతి. 5:22.**

ఆత్మ ఫలాల్లో మొదటిది ప్రేమ చివరిది ఆశానిగ్రహము. మొదటి ఫలమైన ప్రేమను కలిగియుంటే చివరి ఫలమైన ఆశానిగ్రహమును కూడా మనము కలిగియుంటాము. ఆశానిగ్రహము మనజీవితములో చాలా ప్రాముఖ్యమైనది. **"జ్ఞానమందు ఆశానిగ్రహమును అమర్చుకొనుడి" 2పేతురు 1:6.** ఈ జ్ఞానము దైవికమైన జ్ఞానము, పరలోక జ్ఞానము, పైనుండి వచ్చు జ్ఞానము. ఈ జ్ఞానముతో మనము నింపబడినప్పుడు ఆశానిగ్రహమును దేవుడు మనలో పెడతారు. మనము చాలా తెలివైనవారముగా కనబడతాము. మనకి ఈ లోక జ్ఞానము చాలా ఎక్కువ కాని మనకు దైవికమైజ్ఞానము కావాలి. దైవిక జ్ఞానము ఎప్పుడైతే కలిగి ఉంటామో అప్పుడు ఆశానిగ్రహమును కూడా మనము కలిగియుంటాము.

**"పైనుండివచ్చు జ్ఞానము మొట్టమొదట పవిత్రమైనది.. " యాకోబు 3:17. ఈ జ్ఞానం మనకి కావాలి.** పవిత్రత ఉన్నప్పుడే ఆశానిగ్రహము ఉంటుంది. ఈ లోక జ్ఞానము అపవిత్రమైనది. ఈ దినములలో సెల్‌ఫోన్ వలన జ్ఞానము బాగా పెరిగిపోయి ప్రజలను ఈడ్చుకెళ్లి పోతుంది, భ్రష్టులైపోతున్నారు. **"మొదట భ్రష్టత్వం సంభవించి నాశనపాత్రుడగు పాపపురుషుడు ప్రవేశిస్తాడు" 2థెస్స. 2:3** అని దేవుని వాక్యం సెలవిస్తుంది. హృదయము దేవుని యొక్క ఆలయం మనము దేవుని ఆత్మతో నింపబడాలి. సెల్‌ఫోన్‌లో ఉన్న అపవిత్రత, లోకంలో ఉన్న వ్యర్థత్వమంతా అపవాది హృదయములోనికి తీసుకొనివచ్చి అపవిత్రమైన జ్ఞానముతో నింపి దైవిక జ్ఞానమును నెట్టివేస్తున్నాడు. ఒకగ్లాస్ పాలలో నీరు పోస్తూ ఉంటే కొంతసేపటి తరువాత గ్లాస్‌లోఉన్న పాలన్ని బయటికి వెళ్లి నీరు ఉంటుంది. మురికి నీరు ఉన్న గ్లాస్‌లో మంచి నీరు పోస్తూ ఉంటే గ్లాస్‌లో ఉన్న మురికి నీరు బయటికి వెళ్లి మంచి నీరు మిగులుతుంది. మన హృదయము కడుగబడి దేవునికి సమీపముగా నడుచుచున్నప్పటికి లోకజ్ఞానముతో నింపబడేవారమైతే పవిత్రమైన జ్ఞానం ప్రక్కకు వెళ్లిపోయి, పవిత్రమైన హృదయమును పరిశుద్ధమైన జీవితమును కోల్పోయి హృదయములో అపవిత్రత మాత్రమే మిగులుతుంది. చూపుల మీద జయములేదు, ఆలోచనలమీద జయములేదు ఎందుకనగా నీలోని పవిత్రమైన

జ్ఞానము ప్రక్కకు వెళ్లిపోయింది. **"యెహోవాయందు భయభక్తులు కలిగియుండుటయే జ్ఞానమునకు మూలము" సామెతలు 9:10.** దైవభయము పోయింది కాబట్టి సెల్‌ఫోన్‌లో ఉన్న అపవిత్రతను ప్రజలు హృదయములో నింపుకొనుచున్నారు. పరిశుద్ధత, యథార్థత, నమ్మకత్వమే మన జీవితములకు ఆశీర్వాదము.

పరసంబంధమైన జ్ఞానముతో నింపబడినప్పుడే ఆశానిగ్రహము ఉంటుంది. కొంతమందికి చాలా విషయాల్లో ఆశానిగ్రహము ఉండదు. తిండి మీద ఆశానిగ్రహం ఉండదు. దేనిని తినకూడదని చెప్తారో దాన్నే తింటుంటారు. ఏది వద్దని చేప్తే దాని మీదికే వారి దృష్టి వెళ్తుంది. త్రాగే వారికి త్రాగొద్దు గుండె చెడిపోతుంది అని డాక్టర్ చెబితే వారు వినరు. తిండిబోతులు ఆగరు. నీకు ఆశానిగ్రహము లేకపోతే తిండిమీద, నిద్రమీద, లోకంమీద జయము ఉండదు. పరసంబంధమైన జ్ఞానము ఉన్నప్పుడు దేవునికి అవమానం రాకూడదనే దైవభయము కలిగి అన్ని విషయములలో జాగ్రత్తపడతాము. మన బ్రతుకు మూలముగానైనా చావు మూలముగానైనా ప్రభువు నామం ఘనపరచబడవలెను ఫిలిప్పి. 1:19. ఆశానిగ్రహము లేకపోవుట వలనే దురాలోచనలు వస్తాయి. శరీరసంబంధమైన బలహీనతలు వస్తాయి. ఆత్మ సంబంధమైన శ్రద్ధ లేకపోవుట చేత అవిశ్వాసం అనారోగ్యం వచ్చేసి అపవాది నిన్ను ఉపదేశములోనుండి ప్రక్కకు తీసుకు వెళుచున్నాడు. ఆశానిగ్రహమును పోగొట్టుకొని సమర్పణను బద్దలు చేసుకోవద్దు. ఆశానిగ్రహము లేకపోతే నిబంధనలు బద్దలైపోతాయి. నీ సమర్పణ బద్దలైపోతుంది. ఆశానిగ్రహములేకనే అనేకులు నిలబడలేకపోతున్నారు. కోరికలమీద, ఆలోచనలమీద జయములేక లోకముమీద జయమును చూడలేకపోతున్నారు. ఈ ఆశానిగ్రహము హృదయములలో కొదువైపోవడం వల్లనే అనేకమార్లు తప్పిపోయే పరిస్థితులు వస్తున్నాయి. ఆశానిగ్రహం కొరకు మన వ్యక్తిగత ప్రార్థనలో పోరాడాలి.

యోబుకు ఆశానిగ్రహం ఉన్నది. అందుకనే అన్ని పరిస్థితుల్లో కూడా నిలబడగల్గినాడు. పిల్లలు చనిపోయారు, ఆస్తి అంతా పోయింది, ఆరోగ్యం పోయింది, భార్య దూషించింది, స్నేహితులు దూరమైపోయారు. ఆరోగ్యం లేదు చిల్ల పెంకులతో తన శరీరాన్ని గీకుకొనే పరిస్థితి వచ్చింది కాని యోబు యొక్క హృదయములో ఆశానిగ్రహము ఉన్నది. ఈ ఆశానిగ్రహము నీరీక్షణను కలుగజేస్తుంది. దేవుని దగ్గర నిలబడేటట్లు చేస్తుంది. దేవుని కొరకు ఓర్చుకొనేటట్లు

చేస్తుంది. ఓర్పు గొప్ప ద్రోహకార్యములు జరుగకుండా చేస్తుంది. మనము దేవుని కార్యములకొరకు నిరీక్షించినప్పుడు ప్రభువు సహాయము చేస్తారు.

పైనుండివచ్చు జ్ఞానము మొట్టమొదటి పవిత్రమైనది. ఈ రోజు మన హృదయములో ఉన్న జ్ఞానము పవిత్రమైనదా? లోక సంబంధమైనదా? లోకజ్ఞానము లేకపోతే ఎలా అని చాలా మంది చెప్తారు. లోకజ్ఞానము లేకపోయినా, లోకము గురించి తెలియకపోయినా పర్వాలేదు కాని పరిశుద్ధమైన జ్ఞానముతో మనము నింపబడి పవిత్రముగా ఉంటేచాలు. పవిత్రమైన జ్ఞానముతో నింపబడనప్పుడు వేటిమీదనైనా ప్రభువు ఆశానిగ్రహమును ఇస్తారు. కొంతమందికి కన్నులమీదఆశానిగ్రహము ఉండదు.వారికి చూసినదంతా కావాలి. హవ్వ కూడా ఏదేను తోటలో దేవుడు తినవద్దని చెప్పిన పండును చూసినప్పుడు అది ఆమె కన్నులకు అందమైనదిగాను, రమ్యమైనదిగాను కనబడింది. కాని ఆమె కన్నులకు ఇంపైనదే ఏదేను తోటలో నుండి ఆమెను బయటికి తీసికెళ్ళిపోయింది. నోటికి రుచిగా ఉండి కన్నులకు ఇంపుగా ఉండేది ఏదైనా సరే అది మన ప్రాణములకు హానికరమైనది. ఏదైనా బాగుంది అని కన్ను చెప్తుంటే నీకు హాని కలుగబోతుందని అర్థం. నీ ప్రాణానికి నష్టం, నీ ఆత్మకి నష్టం, నీ వ్యక్తి గత జీవితానికి అది నష్టాన్ని కలుగజేస్తుంది. శాపగ్రస్తమైన దానిని చూసి ఆశించిన ఆకానుమీద రాళ్లు కుప్పగా వేయబడినవి. కుష్ఠరోగి నయమాను కానుకను చూసి ఆశించిన గేహజీ కుష్ఠువ్యాధితో దైవజనుడైన ఎలీషా దగ్గర నుండి వెళ్ళిపోయాడు. ఆదాము హవ్వలు ముండ్ల తుప్పలలోనికి వెళ్లిపోయారు. ఈ రోజు మన జీవితములను పరీక్షించుకుందాము.

**"పైనుండివచ్చు జ్ఞానము.... సమాధానకరమైనది" యాకోబు 3:17.** పరిశుద్ధమైన పరలోక జ్ఞానంతో, సమాధాన సంబంధమైనఆత్మతో మన హృదయములు నింపబడిన తరువాత శత్రువులతో, విరోధులతో ఎవరితోనైనా సమాధానముగా ఉంటాము. విరోధులను ప్రేమించే కృప, సహించే కృప, భరించే కృప దేవుడు మనకు ఇస్తారు. అందరితో సమాధానమును కలిగియున్నామా..? నీకు పరలోక జ్ఞానము ఉంటే శత్రువులు ఉండరు. ప్రభువుకు శత్రువులు విరోధులు లేరు. ఆయనను అప్పగింపనైయున్న ఇస్కరియోతు యూదాతో ప్రభువు కలిసి కూర్చున్నారు, కలిసి భుజించారు, అతని పాదాలు యేసయ్య కడిగారు. శత్రువులతో నీవు కూర్చొనగలవా..? విరోధులతో, ప్రేమించలేని వారితో

కూర్చొనగలవా..? దేవుడు చూస్తున్నాడు. నీవెవరి ప్రక్కన కూర్చుంటున్నావు..? ఏ ఉద్దేశంతో కూర్చుంటున్నావు? కొందరితో ఎందుకు కూర్చొలేకపోతున్నావు..? ఎక్కడో అసమాధానము, ఎక్కడో అనైక్యత, ఎక్కడో ఏకభవించలేని స్థితి, ఎక్కడో ప్రేమించలేని స్థితి నిన్ను దూరంగా తీసికొనివెళ్ళిపోతుంది.

**"పైనుండివచ్చు జ్ఞానము ...మృదువైనది" యాకోబు 3:17.** పరలోకజ్ఞానము మృదువైనది. ఇది మెత్తనైన స్వభావం, కరుకైనది కాదు. ఒక కూటములో సహోదరుని ప్రక్కన క్రొత్తగా వచ్చిన ఒక చిన్న బాబు కూర్చొన్నాడు. పాటలు పాడుతున్నారు. ఈ సహోదరుడు పాట నెంబర్ విన్నాడు. ప్రక్కన ఉన్న చిన్న పిల్లవాడు పాట నెంబర్ వినలేదు. అన్న పాట నెంబర్ ఎంత అని ఆ పిల్లవాడు అడిగాడు. అప్పుడు ఆ సహోదరుడు పాట నెంబర్‌ను గట్టిగా కరుకుగా చెప్పాడు. ఆ దెబ్బకు ఆ పిల్లవాడు ఆదిరిపోయి కూటంలో లేకుండా వెళ్లిపోయాడు. కారణం ఆ పెద్దాయన జ్ఞానవంతుడే కాని ఆ జ్ఞానంలో నుండి మృదుత్వం బయటకు రాలేదు. నీలో ఈ మృదుత్వం ఉండాలి. ఎక్కడా కరుకైన స్వభావం పనిచేయకూడదు. నీవు పనిచెప్పేటప్పుడు, పిలిచేటప్పుడు ఆ ప్రేమలో మృదుత్వం కనబడాలి. నీవు పరలోకజ్ఞానముతో నింపబడి ఉంటే నీవు పిలిచే పిలుపులో మృదుత్వం ఉంటుంది. మన జీవితములలో దైవభక్తిని సాధకం చేయాలి. అది ఒక రోజు కాదు జీవితకాలమంతా సాధకం చేయాలి. ఇప్పుడు భక్తిని కాపాడుకుంటూ ఉన్నా అపవాది పొంచివుంటాడు జాగ్రత్త. బాగా ఉన్నాను గదా అని అతిశయిస్తుంటే అపవాది వచ్చి మనస్సు త్రిప్పివేస్తాడు. కాబట్టి మనకు ఇవ్వబడిన జ్ఞానములో, మన మాటల్లో, పిలుపులో, ప్రేమలో, మన క్రియల్లో మృదుత్వం కనబడాలి. ఏదైనా వస్తువు అడిగినప్పుడు విసిరివేయడం వేరు, చేతితో ఇవ్వడం వేరు. అన్ని కోణాల్లో నిలువెల్లా ఆపాదమస్తకం మృదుత్వం కనబడాలి. కఠినత్వము కనబడకూడదు. నీలో ఇంకా కఠినత్వం ఉంది అంటే అది లోకసంబంధమైన జ్ఞానము. పేతురు ప్రభువును నా సహోదరుడు తప్పిదము చేసిన యెడల నేను ఎన్ని మారులమట్టుకు క్షమించాలని అడిగెను. పేతురు 7 మార్లు మట్టుకా అని ప్రభువును అడిగెను. అందుకు ప్రభువు 70 ఏళ్ల మారుల మట్టుకు క్షమించవలెను అని చెప్పెను. పేతురుకు తొందరపాటు ఎక్కువ, సహనం లేదు, ఆశానిగ్రహమేలేదు. అటువంటి పేతురే – వెలుపలికి వెళ్లి సంతాపపడి ఏడ్చి తనపాపమును ఒప్పుకొని నూతనసృష్టిగా మార్చబడి జ్ఞానమందు

ఆశానిగ్రహము ఉందని వ్రాసాడు. పేతురు తన జీవితములో దానిని అభ్యాసము చేశాడు. ఆ ఆశానిగ్రహమును కలిగి తన జీవితములో చివరి వరకు దేవుని కొరకు బ్రతికి ప్రభువు కొరకు హతసాక్షి అయ్యేటప్పుడు ఒక మాట చెప్పాడు. ప్రభువుని నిలువగా సిలువ చేశారు. నన్ను ఆలాగు సిలువవేయవద్దు నేను తగను నన్ను తలక్రిందులుగా సిలువ వేయుమని చెప్పెను. ప్రభువు కొరకు అంత తగ్గించుకున్నాడు.

**"పైనుండివచ్చు జ్ఞానం .... సులభముగా లోబడునది" యాకోబు 3:17.** పరలోకసంబంధమైన జ్ఞానంతో నింపబడినప్పుడు వెంటనే లోబడుతాము. నేను లోబడలేకపోతున్నానని చాలామంది చెప్తారు. లోబడలేకపోవటానికి కారణం పరలోకజ్ఞానము మనలో లేకపోవడమే. పరలోక జ్ఞానముతో నింపబడలేదు అంటే హృదయములోనికి ఎక్కడో అవిధేయత అపవిత్రత, అసమాధానం వచ్చివుంటాయి ఇవి ఉంటే నీవు లోబడలేవు. పరసంబంధమైన జ్ఞానము సులభముగా లోబడుతుంది. ఆ జ్ఞానములో కనికరము ఉంటుంది. కనికరము గలవారు ధన్యులు వారు కనికరం పొందుదురు. కొన్నిసార్లు కొన్ని విషయాల్లో మనకు కనికరము ఉండదు చాలా కఠినముగా ఉంటాము. కొన్నిసార్లు మనము అనుకొంటాము కఠినముగానే ఉండాలని. ప్రభువు జనసమూహాన్ని చూసినప్పుడు కనికరపడినారు. ఈ కనికరము కలిగిన ఆత్మ దైవిక జ్ఞానములో నుండే బయటకు వస్తుంది. ఎక్కడ కనికరము ఉంటుందో అక్కడ ఫలములు విస్తారముగా ఉంటాయి. ఒక చెట్టుకి రెండురకాల మందులు వేస్తారు. సహజంగా ఒకటి తెగులు రాకుండా, మరొకటి పంట బాగా పండడానికి. మంచి ఫలాలు ఫలించడానికి మొక్కకి ఎరువు ఎలా వేస్తామో పరలోక జ్ఞానముకూడా మన జీవితములకు ఒక ఎరువు లాంటిది. ఇక చీడ పీడలు ఉండవు. బలమైన మందు ఆ మొక్కకు కొడితే ఏ వ్యాధి వచ్చినా తట్టుకోగల వ్యాధి నిరోధకశక్తి ఉండి బాగుగా ఫలిస్తుంది. శత్రువులతో యుద్ధం చేసేటప్పుడు సైన్యంలో తక్కువ మంది ఉన్నారనుకొండి శత్రువులు యుద్ధం చేసి దేశాన్ని స్వాధీనం చేసికొంటారు. అందుకే సరిహద్దుల్లో భద్రతా దళాలను పెడతారు. శరీరంలో కూడా వ్యాధి నిరోదక కణములు ఉంటాయి. వాటిని ప్రభువే సృష్టించారు. అవి బలంగా లేకపోతే వ్యాధి బారిన పడిపోతాము. ఆలానే ఆత్మ సంబంధమైన జీవితంలో ఆశానిగ్రహము లేకపోతే బలహీనులమైపోతాము. దీనిని మనము కలిగి ఉండాలంటే ఆత్మలో బలవంతులముగా ఉండాలి. బలవంతులముగా

ఉండాలంటే పరసంబంధమైన జ్ఞానముతో నింపబడాలి. అప్పుడు ఏ విధమైన శరీర సంబంధమైన కార్యాలు మనలో పనిచేయవు. కోపము క్రోధము అసూయ ద్వేషము ...ఈ శరీర కార్యాలు మనలోనికి రాలేవు.

యోసేపు ఆత్మలో, పరిశుద్ధతలో బలవంతుడు. పోతీఫరు భార్య యోసేపు వస్త్రమును పట్టుకొనినప్పుడు పారిపోయాడు. యోసేపులో ఆత్మబలము లేకపోతే వెంటనే లొంగిపోయేవాడు. బత్షెబాకు ఆ బలము లేదు కాబట్టి రాజైన దావీదు ఆమెను పిలిపించినప్పుడు భయపడిపోయి లొంగిపోయింది. పోతీఫరు భార్యకి లోక సంబంధమైనబలము ఉన్నది అందుకే యోసేపును చెరసాలలో పెట్టించినది. ఆమె బలము యోసేపు ఆత్మీయ జీవితానికి నష్టమేమి కలిగించలేకపోయింది. అవమానము వచ్చింది రానివ్వండి. చెరసాలలో బంధించబడ్డాడు కాని యోసేపుకు ఆత్మలో బలము ఉన్నది. దైవికజ్ఞానముతో నింపబడి ఉన్నాడు. దేవుని ఆత్మగల మనుష్యుడని యోసేపును గురించి ఫరో సాక్ష్యమిచ్చెను. అటువంటి జ్ఞానమును, వివేకమును దేవుడు మనకు కూడా ఇస్తారు. ఫోన్ వస్తే ఊగిపోతుంటారు కొంతమంది. ఎందుకు అంత కంగారు ఎందుకు కలవరం, తెలియని నెంబర్ వచ్చింది ఏంటో చూద్దాం అని వలలో పడిపోయినవాళ్ళు చాలా మంది ఉన్నారు. తెలియని నెంబర్‌కు ఫోన్‌చేయాలనే ఆతురత నీకు ఉండకూడదు. ప్రార్థన చెయ్యండి ప్రభువు సహాయం చేస్తారు.

ఆత్మ సంబంధముగా బలవంతులముగా ఉంటే మంచి ఫలములు ప్రభువు మనకు ఇస్తారు. ఈ జ్ఞానం లేకపోతే ప్రేమ సంతోషము సమాధానము దయాళత్వము సాత్వికము విశ్వాసము ఆశానిగ్రహము అనే ఆత్మ సంబంధమైన ఫలములు ఫలించలేము. దైవికమైనజ్ఞానము ఉన్నప్పుడే, దైవికమైన విధేయత ఉన్నప్పుడే మంచి ఫలములు మనము ఫలించగలుగుతాము. యోసేపు ఫలించాడు, దానియేలు ఫలించాడు, షద్రకు మేషాకు అబెద్నెగోలు మంచి ఫలములు ఫలించారు. వారు విరోధులతో కూడా సమాధానాన్ని కాపాడుకొన్నారు. రాజులే అగ్నిగుండములో నుండి సింహాల గుహలో నుండి బయటికి తీసికొచ్చారు. చెరసాలలో నుండి యోసేపును ఫరో రాజే పిలిపించినది. నీకు ఆ ఆత్మ సంబంధమైన బలము ఎందుకు లేదంటే దైవిక జ్ఞానం లేకపోవడం వలనే. దైవిక జ్ఞానం ఎందుకు లేదంటే దేవునికి భయపడకపోవుట వలనే. దేవునికి భయపడితే అది దైవిక జ్ఞానము, దైవిక జ్ఞానము నుండే ఆశానిగ్రహము వస్తుంది. ఆశానిగ్రహము

ఎప్పుడు ఉంటుందో మన జీవితములలో అన్నింటిని జయించగలిగిన కృప ప్రభువు ఇస్తారు. లోకసంబంధమైన జ్ఞానము లోకసంబంధమైన కుయుక్తులు చాలా సంపాదించుకొన్నాము కాని వాటివలన ఉపయోగంలేదు. అది మట్టిలో కలిసిపోయేదే. పరలోక జ్ఞానము యుగయుగాలు మనతో ఉంటుంది. పరసంబంధమైన జ్ఞానము వివేచన ఆలోచన తలంపులతో మనము నింపబడి ఉన్నప్పుడు వేషదారణ ఉండదు. పక్షపాతం ఉండదు. నటించవలసిన అవసరంలేదు. అంతరంగము ఎలా ఉంటుందో బహిరంగ జీవితము కూడా అలానే ఉంటుంది. అంతరంగము ఎలా ఉందో మన హృదయము కూడా తెరువబడిన పుస్తకంవలె ఉంటుంది. వేషదారణ పక్షపాతంతో నిండుకొన్న వారముగా ఉండకూడదు. సమాధానము పోగొట్టుకొన్నవారిగా ఉండకూడదు. మంచి ఫలములు ఫలించి ఆశానిగ్రహమును కలిగి జీవించాలని ప్రభువు కోరుకొంటున్నారు. మన పితరులు పరిశుద్ధులు ఆ ఆశానిగ్రహమును కలిగి జీవించారు.

పౌలు భక్తి జీవితంలో ఎన్ని పరిస్థితులు వచ్చినా రాజీపడలేదు. శ్రమలు, నిందలు, అవమానాలు, కరువు, ఖడ్గం, వస్త్రహీనత, ఉపద్రవం, జాగరణాలు, ఆకలి దప్పులు, ఓడబద్దలైపోయే పరిస్థితులైన పౌలు ఆశానిగ్రహమును కలిగియున్నాడు. ఆశానిగ్రహమును పోగొట్టుకొనలేదు. పౌలును తిరస్కరించిన శతాదిపతే పౌలును రక్షించడానికి ప్రయత్నించెను. ఆశానిగ్రహము ఉంటే పరిస్థితులన్నింటిని ప్రభువు నీకు అనుకూలంగా మార్చివేస్తారు. యోసేపు పదమూడు సంవత్సరములు ఆశానిగ్రహమును కలిగి ఉన్నాడు. నేరారోపణ చేయలేదు చెరసాలలో ఉన్న ఖైదీలకు పోతీఫరు భార్య గురించి చెప్పలేదు. పోతీఫరు భార్య వలన నేనిక్కడ ఉన్నానని చెప్పలేదు. దేవుని సమయం వచ్చింది. దేవుడు చెరసాలలో నుండి బయటకు తీసికొనివచ్చి సింహాసనమెక్కించారు.

ప్రియమైన దేవుని బిడ్డలారా! మన ఆత్మీయ జీవితములో దేవునికి లోబడి అత్యున్నతమైన పరిశుద్ధ జీవితం చేసి పరలోక జ్ఞానముతో నింపబడి వేషధారణ, పక్షపాతం లేకుండా ఆశానిగ్రహము కలిగి ఫలించి అభివృద్ధి పొంది దేవునికి మహిమకరముగా జీవించవలెను. తద్వారా నూతన ఆత్మలను మనము ప్రభువు కొరకు సంపాదించగలము. అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం చేయును గాక!

# <u>నిరీక్షించుట</u>

**ఆయన వలననే నాకు నిరీక్షణ కలుగుచున్నది - కీర్తనలు 62:5.**

మనం అడిగిన వాటికి సమాధానాల కోసం కనిపెట్టడాన్ని సాధారణంగా నిర్లక్ష్యం చేస్తుంటాం. ఇంతలోనే మన అడగడంలోని తేలికదనం బయటపడుతుంది. రైతు తాను వేసిన పంట కోతకి వచ్చేదాకా పాటుపడుతూనే ఉంటాడు. గురిచూసి కొట్టే ఆటగాడు తాను విసిరినది గురికి తగిలేదాకా చాలించుకోడు. ఓ డాక్టరైతే తాను వేసిన మందు ఎలా పనిచేస్తున్నదో కనిపెట్టి చూస్తుంటాడు. మరి క్రైస్తవుడు తన ప్రార్థనా ఫలితాలకోసం ఎందువల్ల పట్టుదలతో కనిపెట్టడం లేదు?

దేవుని చిత్తం ప్రకారం, విశ్వాససహితంగా, వాగ్దానుసారంగా యేసునామం పేరిట, పరిశుద్ధాత్మ ఆవేశంలో ఈ ఇహలోకపరమైన ఆశీర్వాదాల కొరకు గాని ఆత్మీయాభివృద్ధి కొరకు గాని చేసే ప్రతి ప్రార్థనా సంపూర్ణ అంగీకారాన్ని పొందింది, లేక పొందుతుంది.

దేవుడు ఎప్పుడూ తన ప్రజల విన్నపాలను, అభిప్రాయాలను మొత్తం మీద ఉన్నవి ఉన్నట్టుగానే స్వీకరిస్తాడు. తద్వారా ఆయనకి మహిమా వారికి నిత్యమూ ఆత్మీయ క్షేమమూ కలుగుతాయి. క్రీస్తు కరుణనాశించి ఆయన దగ్గరికి వచ్చిన ఒక్క అభ్యర్థనను కూడ ఆయన నిరాకరించినట్టు కనబడదు. అందుకనే ఆయన పేరిట మనం చేసే ఏ ప్రార్థన కూడా వృథాగా పోదని మనం నమ్ముతాము.

ఓ ప్రార్థనకి జవాబు మనలను చేరవస్తూ ఉంటుంది, మనం దాన్ని చూడలేక పోవచ్చు. విత్తనం చాలాకాలం నేలలో ఉంటుంది. సరైన కాలం వచ్చేసరికి దాని ఆకులు విచ్చుకుని కనిపిస్తాయి. అది ఇంకా మొలకెత్తనంత కాలం ఆ విత్తనం చచ్చినట్టే, లేనట్టుగానే ఉంటుంది మన కళ్ళకి.

ప్రార్థనకు ఆలస్యంగా జవాబు రావడం అన్నది విశ్వాసానికి పరీక్ష మాత్రమే కాదు. అడ్డంకులు కనిపిస్తూ ఉన్నప్పుడు కూడ దేవునిపై మనకి గల నిశ్చయతను ప్రదర్శించడం ద్వారా ఆయన్ని ఘనపరచడానికి ఇది మనకి సహాయపడుతుంది.

**"మేము తప్పించుకొనిన తరువాత ఆ ద్వీపము మెలితే అని తెలిసికొంటిమి"**

**-అపొ.28:1.**

దేవుని కొరకు ఎంతో నిష్టతో పరిచర్య చేయుచున్న పౌలు యూదులచేత బంధింపబడి ఖైదీగా రోమా చక్రవర్తియెదుట నిలువబెట్టబడుటకు శతాధిపతి, సైనికులు మరియు ఇతర ఖైదీలు మొత్తం 276 మందితో ప్రయాణమై ఇటలీకి ఓడ ఎక్కెను. కొంతదూరము ప్రయాణించిన తరువాత తుపాను తాకిడికి ఓడ బ్రద్దలై ఓడలోని వారందరు సముద్రములో దుమికి కొందరు పలకలమీదను కొందరు ఓడచెక్కలమీదను తప్పించుకొని సముద్రపు దరినున్న మెలితే ద్వీపమునకు చేరిరి. అప్పుడు వర్షము కురియుచు చలిగా ఉన్నందున అనాగరికులగు ఆ ద్వీపవాసులు నిప్పురాజబెట్టి అందరిని చేర్చుకొనిరి. అప్పుడు పౌలు మోపెడు పుల్లలు ఏరి నిప్పులమీద వేయగా ఒక సర్పము కాకకు బయటకు వచ్చి అతని చెయ్యి పట్టెను.

అపొస్తలుడైన పౌలు తన సేవాజీవితంలో ఎన్ని విజయ శిఖరాలు ఎక్కినను ఎంతో తగ్గింపుతో మెలితేలో పుల్లలు ఏరెను. పౌలు పరిచర్య విలువను గుర్తెరిగినవాడు. అందుకే పరిశుద్ధులకు పరిచర్య చేయుటకు యెరూషలేమునకు కూడ వెళ్ళెను. సంఘ క్షేమాభివృద్ధి కొరకు పౌలు ఎంతైనా ప్రయాసపడుటకు ఇష్టపడినాడు. డేరాలు కుట్టుకొని జీవనం కొనసాగిస్తు రాత్రింబవళ్ళు సహోదరుల ఉజ్జీవం కొరకు దేవుని పనిచేసేగొప్ప వైరాగ్యం గల దైవజనుడు పౌలు. మనము పాపము చేయుటకే సిగ్గుపడవలెను కాని ఎంత తగ్గించుకొని పరిచర్య చేయుటకైన వెనుకంజ వేయరాదు. పరిచర్య మనకు తగ్గింపును దీనత్వమును నేర్పించును. మనలను పరిచారకులుగా ఉండుటకే ప్రభువు పిలిచారు. సమూయేలు ఏలీ ఎదుట యెహోవాకు పరిచర్య చేసెను. మన ప్రభువైన యేసయ్య కూడా పరిచర్య చేయుటకే నేను వచ్చానని సెలవిచ్చెను. మదర్ థెరీస్సా అభాగ్యులకు ప్రేమతో చేసిన పరిచర్యే ఆమెను క్రీస్తు సాక్షిగా నిలిపెను. మనమెన్నడు దైవపరిచర్య విషయంలో సిగ్గుపడరాదు, తప్పించుకొనరాదు. ఆ రోజు పుల్లలేరిన పౌలు ఆ తదుపరి అనేక ఆత్మలను కనుగొని దేవుని ఎదుట వారిని సాక్షులుగా నిలిపెను.

**ఆత్మలో ఎదుగునప్పుడు శోధనలు :** పౌలు నిప్పులమీద పుల్లలు వేయగా ఆ కాకకు సర్పము బయటకు వచ్చి పౌలు చేతిని పట్టెను. మనము ఎప్పుడైతే

ఆత్మీయ తీవ్రతకు ప్రయత్నిస్తామో అప్పుడే శోధన ఏదో ఒకరీతిగా మనలను కలవరపరచును. సాతాను మనలను ఆత్మీయతకు దూరంగా ఉంచాలని, మన ప్రార్థన జీవితాన్ని, మన ప్రతిష్టితను భంగపరచాలని నిరంతరం ప్రయత్నిస్తాడు. అయితే అంతిమ విజయం మనదే. పౌలు ఆ సర్పమును అగ్నిలో విసిరివేసి ఏ హానిలేకుండా సురక్షితంగా ఉన్నాడు. క్రీస్తు నిమిత్తం మనకెదురయ్యే ప్రతి వ్యతిరేక పరిస్థితుల్లో మనము సహనము పోగొట్టుకొనరాదు. మనకెదురయ్యే ప్రతి శోధనలో ప్రభువు మనలను ధైర్యపరచును. విశ్వాస జీవితంలో సేవలో మనము ముందుకే సాగవలెను. మన ప్రభువు ఎన్నడు మనలను సిగ్గుకు అప్పగించడు.

**నీకు కలిగిన శోధనలో ప్రజల అపార్థాలు - ప్రజల నిరాదరణ : "ఆ ద్వీపవాసులు ఆ జంతువతని చేతిని వ్రేలాడుట చూచినప్పుడు నిశ్చయముగా ఆ మనుష్యుడు నరహంతకుడు ఇతడు సముద్రమునుండి తప్పించుకొనినను న్యాయమాతనిని బ్రదుకనియ్యదని తమలో తాము చెప్పుకొనిరి" అపొ. 28:4.** ఎప్పుడైతే సర్పము పౌలు చేతిని పట్టెనో వెంటనే అక్కడి ప్రజలు ఇతడు నరహంతకుడని ఇతడు బ్రతుకడని చెప్పడం ప్రారంభించిరి.

నీవు వ్యాధిగ్రస్తునిగా ఉన్నప్పుడు ప్రమాదాలకు గురైనప్పుడు లేక కష్టనష్టాల్లో కూరుకుపోయినప్పుడు ప్రజలు ఎప్పుడు మనలను పాపులుగా తప్పిపోయినవారిగా చూస్తారు. అంతమాత్రమున మనము కలవరపడకూడదు. యోబు కష్టాల్లో కృంగిపోతున్న వేళల్లో స్నేహితులు అతనిని దోషిగా తప్పిపోయినవానివలె తలంచుచున్నారు అయినను యోబు దేవుని బట్టి ధైర్యంగా ఉన్నాడు. పౌలు వలన మేలు పొందిన ఖైదీలు ఈ పౌలు అటువంటివాడు కాదని మాట్లాడలేకపోయిరి. నీకు కలిగిన నిందల్లో, ఆపదల్లో, నీ మీద జాలిపడువారు ఎవరు లేకపోయిన ప్రభువు నిశ్చయముగా నిన్ను ఓదార్చును. ప్రజల దూషణల మధ్య నీవు క్రీస్తు ప్రేమ స్పర్శను అనుభవిస్తావు తనను అపార్థం చేసుకొంటున్న ప్రజలను తాను ఎంత మాత్రము ద్వేషించలేదు. శోధన తరువాత వారి క్షేమం కొరకు ఎంతో ప్రార్థించాడు. పౌలు నిరీక్షణతో అచంచలమైన విశ్వాసముతో ఈ గొప్ప శోధనలో జయం కొరకు ప్రార్థించి యుంటాడు.

**శోధనలో నీకు గొప్పజయం - దేవుని వలన గొప్పఘనత కలుగుతుంది : "అతడైతే ఆ విషజంతువును అగ్నిలో జాడించి వేసి, యే హానియు పొందలేదు"**

**అపొ. 28:5.** మనకు కలిగిన శోధనలో మనకేమైన సంభవించునేమో అని ప్రజలు వేచి చూస్తారు. మన విషయంలో కీడునే తలంచుదురు కాని ప్రజల ఆలోచనలకు భిన్నంగా ప్రభువు మన జీవితంలో ఆశ్చర్యకరమైన జయమునిస్తాడు. పౌలుకు ఏ హాని కలుగకుండుట ప్రజలు చూసి తమ అభిప్రాయమును మార్చుకొనుచున్నారు. అంతేకాదు ఇతడొక దేవత అని కొనియాడుచున్నారు.

ప్రియులారా! ప్రజలు మనలను నిందించినప్పుడు మనము కృంగిపోరాదు మనలను ఘనపరచినప్పుడు ఉప్పొంగిపోరాదు. శోధన సహించువాడు ధన్యుడు అతడు శోధనలో నిలిచినవాడైతే గొప్ప ఫలము పొందుకుంటాడు. ప్రతి శోధన తరువాత గొప్ప జయము ఘనత దొరుకుతుంది.

**నిందించబడినచోట - శోధించబడినచోటే గొప్ప పరిచర్య : "అప్పుడు పొప్లియొక్క తండ్రి జ్వరముచేతను రక్తభేదిచేతను బాధపడుచు పండుకొని యుండెను. పౌలు అతనియొద్దకు వెళ్లి ప్రార్థనచేసి, అతనిమీద చేతులుంచి స్వస్థపరచెను ఇది చూచి ఆ ద్వీపములో ఉన్న కడమ రోగులు కూడా వచ్చి స్వస్థత పొందిరి" అపొ. 28:8,9.** పౌలు ఏ ద్వీపములో శోధించబడి నిందించబడ్డాడో అక్కడే గొప్ప ఘనతను ఫలములను చూశాడు. ఆ ద్వీపములో ముఖ్యుడగు పొప్లి యొక్క తండ్రి జ్వరముచేతను రక్తభేదిచేతను బాధపడుచుండగా పౌలు ప్రార్థించినప్పుడు ప్రభువు స్వస్థపరిచారు. ఇదిచూసి ఆ ద్వీపములో కడమ రోగులు కూడా వచ్చి స్వస్థత పొందారు. దేవుని నామం అక్కడ బహుగా ఘనపరచబడినది. ప్రజలు దేవునివైపు తిరిగారు. వారు దైవజనుని ప్రేమతో సత్కారాలతో గౌరవించి స్నేహభావంతో ఆతిథ్యమిచ్చారు. మెలితే అనుభవం పౌలు జీవితంలో ఉన్నతమైన అనుభూతినిచ్చింది. మీరు శోధనలో ఉన్నారా? ఊహించని పరిస్థితులు మిమ్ములను కలవరపరిచాయా? అయితే ఒకరోజు అవి మీకు మేలుగా మారును. విశ్వాసంతో ప్రార్థన చేయుము శత్రువు ఓడిపోతాడు. అంతిమ విజయం మనదే. తద్వారా అనేక ఆత్మలను మనము గెలుచుకొంటాము. విశ్వసించువాడు కలవరపడరు యెషయా 28:16. ఈ శ్రమ కొలిమిని కొంచెం ఓర్పుతో సహించు గొప్ప నెమ్మదిని క్షేమాన్ని దేవుడు మనకు దయచేస్తారు అట్టి కృప దేవుడు మనకు దయచేయును గాక!

## సువార్త ఉజ్జీవ కూటములు

| | |
|---|---|
| **2019 ఫిబ్రవరి 13,14,15** | **నిర్మల్**, తెలంగాణ<br>సెయింట్ థామస్ స్కూల్ ప్రక్కన,<br>ఖానాపూర్‌రోడ్. |
| **2019 ఫిబ్రవరి 16,17** | **కొర్రపాడు**, గుంటూరు జిల్లా<br>జిల్లాపరిషత్ హైస్కూల్ ఎదురు<br>సత్తెనపల్లి రోడ్. |
| **2019 ఫిబ్రవరి 18,19,20** | **నంద్యాల**, కర్నూలు జిల్లా<br>ఎస్.పి.జి గ్రౌండ్స్. |
| **2019 ఫిబ్రవరి 21,22,23** | **నెల్లూరు**, నెల్లూరు జిల్లా<br>వి.ఆర్.సి గ్రౌండ్స్. |
| **2019 ఫిబ్రవరి 24,25** | **కందుకూరు**, ప్రకాశం జిల్లా<br>జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్ గ్రౌండ్. |
| **2019 మార్చి 11,12,13** | **పెందుర్తి**, విశాఖ జిల్లా<br>బృందావన్ గార్డెన్స్,<br>మహిళా ప్రగతి కేంద్రం దగ్గర,<br>విశాఖపట్టణం రోడ్. |
| **2019 మార్చి 26,27** | **నీరుకొండ**, గుంటూరు జిల్లా<br>ఓలీవలకొండ ప్రార్థనా మందిరం ఎదురు. |

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2019-21

# కన్వెన్షన్ – 2019

**తేదీలు : ఏప్రియల్ 23 సా॥ నుండి 26 మ॥ వరకు**

**స్థలం : బుడంపాడు, గుంటూరు**

**ప్రతిరోజు ఉ॥ 10 గం॥లకు మరియు సా॥ 6:30 ని॥లకు**

If undelivered please return to :

**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : 9491475967, 9290901396

To,
Sri / Smt.

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 11th & 12th of Every Month